Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్: 9440815774

ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 218 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | బుధవారం 19 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 2

## భారత్‌లో 100 కోట్ల మందికి ఓటరు గుర్తింపు కార్డులు

- ట్రంప్ పోస్ట్ నేపథ్యంలో ఈసీ కీలక ప్రకటన!
- దేశంలో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లకు ఫొటో గుర్తింపు కార్డులు జారీ
- ఈసీ కీలక ప్రకటన- ఓటర్ ఐడీల ప్రాధాన్యతను వివరిస్తూ ట్రంప్ భారత్‌ను ఉదాహరణగా చూపడంతో వివరాల్ని వెల్లడించిన ఈసీ




## 26/11 నిందితులపై 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా'


- ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు ఎంతటి చర్యలకైనా సిద్ధమన్న కేంద్రం
- 26/11 ముంబయి దాడుల కేసులో పాకిస్థాన్‌కు చెందిన ఆరుగురు నిందితులపై ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా
- నిందితులు లేకున్నా విచారణ ప్రారంభం
- ఉగ్రవాదాన్ని తుదముట్టించడమే భారత లక్ష్యమని ఎంఈఏ స్పష్టం






## విద్యార్థుల మాట ప్రభుత్వం వినడం సంతోషకరంగా ఉంది

- ఇదే సరైన మార్గం: రాహుల్ గాంధీ
- విద్యార్థులు, ఝార్ఖండ్ ప్రభుత్వం మధ్య ఏకాభిప్రాయం కుదరడంపై రాహుల్ గాంధీ హర్షం
- విద్యార్థుల భవిష్యత్తుకు న్యాయం జరిగేలా దేశవ్యాప్తంగా వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని వెల్లడి



### స్పష్టమైన విజన్, పారదర్శక పాలనే
## విజయానికి మూలం

- పెట్టుబడుల్లో ఏపీ దూకుడు.. దేశంలోనే 2వ స్థానం
- చంద్రబాబు విజన్ వల్లేనన్న మంత్రి లోకేశ్
- నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీకి దేశంలో 2వ స్థానం
- కేవలం 24 నెలల్లోనే 9వ స్థానం నుంచి రెండో ర్యాంకుకు చేరిన రాష్ట్రం
- సీఎం చంద్రబాబు నాయకత్వమే కారణమన్న మంత్రి లోకేశ్
- ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టి ఇప్పుడు ఏపీపై ఉందని వ్యాఖ్య

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానానికి చేరుకుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కేవలం 24 నెలల వ్యవధిలోనే రాష్ట్రం 9వ స్థానం నుంచి 2వ స్థానానికి ఎగబాకిందని ఆయన వెల్లడించారు. ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వం వల్లే సాధ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి - మిగతా3లో

### అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల
# ఎన్నికలు

- బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలే ప్రధాన అజెండాగా భేటీ
- పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలపై చర్చ



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.1 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.16,500 కోట్ల నిధులు మురిగిపోకుండా అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఏపీ పంచాయతీరాజ్ చట్టం-1994 నిబంధనల ప్రకారం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. న్యాయపరమైన అంశాల్లో ఉన్న 23 మునిసిపాలిటీల విలీనాన్ని తర్వాత పరిశీలిద్దామని, ముందుగా అన్ని స్థానిక సంస్థల్లో ఎన్నికలు నిర్వహిద్దామని - మిగతా3లో




## విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణలో జాప్యం వద్దు

- విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేయాల్సిందేనన్న కాక్రోచ్ జనతా పార్టీ
- కోర్టు అడిగిన ఎఫ్ఐఆర్‌ల జాబితాను ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్న
- విద్యార్థులకు సంబంధించిన అసలు సమస్య ఆందోళనల్లో పాల్గొన్నందుకు నమోదైన కేసులను రద్దు చేయడమే

### బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే
# చరిత్రహీనులే

- బీసీ రిజర్వేషన్ల అంశంపై అసెంబ్లీలో ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ
- మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నిక ఇకపై ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహణ
- గత ప్రభుత్వం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని చంద్రబాబు విమర్శ
- రాష్ట్రంలో జిల్లా ప్రజా పరిషత్‌ల సంఖ్యను 13 నుంచి 28కి పెంచాలని నిర్ణయం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణపై ఎవరైనా కోర్టుకు వెళ్లి కేసులు వేస్తే, వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని అడ్డుకోవాలని చూసే శక్తులను ప్రజానీకం, చరిత్ర క్షమించవని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రసంగించిన ఆయన, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, తమ ప్రభుత్వ లక్ష్యాలను సవివరంగా ప్రకటించారు. బీసీల సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసం రాష్ట్ర మంత్రివర్గం మూడు కీలక నిర్ణయాలు తీసుకుందని చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. దీంతో పాటు, పట్టణాల్లో మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నికను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించామని, ఇది 'ఆయారాం గయారాం' రాజకీయాలకు తెరదించి, సుస్థిరమైన పాలనకు దోహదపడుతుందని వివరించారు. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలోని 28 జిల్లాలకు అనుగుణంగా 28 జిల్లా ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలుగుదేశం పార్టీకి ముందు, ఆ తర్వాత అని స్పష్టంగా చూడవచ్చని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తర్వాతే బీసీలకు రాజ్యాధికారం దక్కిందన్నారు. 1984లో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితోనే తాను 1995లో - మిగతా3లో

## 2027 అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ, పంజాబ్, గుజరాత్‌కు బీజేపీ ఇన్‌ఛార్జ్‌లు

- పంజాబ్ బాధ్యతలు సతీశ్ పూనియాకు
- గుజరాత్ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కీలక నియామకాలు



### ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను
# ప్రోత్సహిస్తున్నాయి

- మోదీపై వ్యాఖ్యలకు గట్టిగా బదులివ్వాలి
- విశాఖలో బీజేపీ శ్రేణులకు నితిన్ నబిన్ పిలుపు
- కాంగ్రెస్ ప్రజాస్వామ్య సంస్థలను పదేపదే అవమానిస్తోందని విమర్శ
- రాహుల్ గాంధీ ఒక పార్ట్-టైమ్ రాజకీయ నాయకుడని ఎద్దేవా
- యువత ఆకాంక్షలపై దృష్టి సారించాలని పార్టీ నేతలకు సూచన



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

దేశంలోని ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్ష నేతలు ఉపయోగిస్తున్న అనుచిత భాషపై పార్టీ శ్రేణులు సంయమనం పాటిస్తూనే, పార్టీ గౌరవానికి భంగం కలగకుండా దీటుగా సమాధానం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖపట్నంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజాస్వామ్య వ్యవస్థలను అవమానపరుస్తోందని - మిగతా3లో

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



## కుప్పం క్లస్టర్-10లో ఘనంగా 'ఇంటింటి తెలుగుదేశం'



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు18:**
కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని క్లస్టర్ -10 ప్యాలస్ రోడ్ యూనిట్‌లో 'ఇంటింటి తెలుగు దేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనిట్ ఇన్‌చార్జ్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో 170వ బూత్ పరిధిలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి చేరువ చేయడమే 'ఇంటింటి తెలుగు దేశం' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకులు గోపినాథ్,20వ వార్డు కౌన్సిలర్ ఎస్.సోమశేఖర్, బూత్ ఇన్‌చార్జ్‌లు లోకేష్, జాలు, కాసిం, టీడీపీ నాయకులు దేవ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో
# డిజిటల్ విద్యకు ODiSI కీలకం
### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు18:**
ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్ విద్యా విధానం వైపు తీసుకెళ్లడంలో ODiSI కార్యక్రమం కీలక మైలురాయిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ODiSIపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని, దాన్ని రోజువారీ తరగతి గది బోధనలో భాగం చేయాలని సూచించారు. సాంకేతికత వినియోగంతో పాఠ్యాంశాలను సులభంగా, సృజనాత్మకంగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించవచ్చన్నారు. ఎంపిక చేసిన ప్రతి పాఠశాలలో ODiSI కార్యక్రమాన్ని సమర్థవంతంగా, నిరంతరం అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డిజిటల్ వేదికలను వినియోగించడం ద్వారా విద్యార్థులను భవిష్యత్ పోటీ పరీక్షలకు అవసరమైన నైపుణ్యాలతో తీర్చిదిద్దవచ్చన్నారు. Google Classroom వంటి వేదికల ద్వారా పాఠం అనంతరం ఆన్‌లైన్ బహుళైచ్ఛిక పరీక్షలు నిర్వహించి విద్యార్థుల అభ్యసన స్థాయిని తక్షణమే అంచనా వేయవచ్చని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి అవసరాలకు అనుగుణంగా పునఃబోధన చేపట్టేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్, OSAAT సంస్థ సలహాదారు కేదార్‌నాథ్, OSAAT ప్రతినిధులు, RASS ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, సమగ్ర శిక్ష AMO సుభాషిణి,22ODiSI పాఠశాలల ఉపాధ్యాయులు, ఆయాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్య రహిత సమాజ
# నిర్మాణానికి యువత ముందడుగు



**గుడిపల్లి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు18:**
మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత భాగస్వామ్యం కావాలని ద్రావిడ విశ్వవిద్యాలయం యూజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.విజయవర్ధిని పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్‌టీఆర్ యూజీ కాంప్లెక్స్ భవనం ఎదుట 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా విద్యార్థులతో మాదకద్రవ్య రహిత భారత్ కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత దేశానికి శక్తి స్వరూపమని, సమాజం, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజాన్ని కూడా చైతన్యవంతం చేయాలని సూచించారు. మార్పు మనతోనే ప్రారంభం కావాలని, జిల్లా, రాష్ట్రం, దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సంకల్పించాల న్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో పాటు ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. హరికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మత్తుకు దూరంగా.. భవిష్యత్తుకు బాటగా







**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు18:**
మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టి యువతను చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతో కుప్పం పట్టణంలో రోసా మిస్టికా పాఠశాల విద్యార్థులు మంగళవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల మీదుగా సాగింది. కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఐఏఎస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువత చెడు అలవాట్లకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ చదువు, క్రీడలు, నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచిం చారు. మాదక ద్రవ్యాల రహిత కుప్పం నియోజకవర్గం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. గుట్కా, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా గుర్తించినప్పుడు వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. "మత్తు వద్దు.. భవిష్యత్తు ముద్దు", "డ్రగ్స్ రహిత సమాజం.. మనందరి బాధ్యత" అంటూ చేసిన నినాదాలు ఆకట్టుకున్నాయి. ర్యాలీ అనంతరం విద్యార్థులు, ఉపాధ్యా యులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కుప్పం లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ మహేష్, అధ్యక్షుడు పి.జి.సెల్వం, జయరాం నాయుడు పాల్గొన్నారు. డాక్టర్ మహేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల అవగాహన కార్యక్రమాలు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను తెలుసుకునేందుకు దోహద పడతాయని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ప్రజలకు కనువిప్పు కలిగించేలా ఉన్నాయని తెలిపారు. రోసా మిస్టికా పాఠశాల వ్యవస్థాపకురాలు రూబీ ఎగ్నెస్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానిక ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పనులు వేగవంతం చేయాలి..
### మౌలిక వసతులు మెరుగుపరచాలి
### కడ పిడి వికాస్ మర్మత్



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు18:**
కుప్పం ప్రాంతంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైనసౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్,ఐఏఎస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. కుప్పంషాదీ మహల్ పునరుద్ధరణ పనులు, కడ అధికారుల అతిథి గృహం సుందరీకరణ, పోగూరుపల్లి పారిశ్రామిక ప్రాంతంలో మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. కుప్పం షాదీ మహల్‌ను సందర్శించిన ఆయన పునరుద్ధరణ పనుల పురోగతిని పరిశీలించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు ఆధునిక వసతులతో షాదీ మహల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ముస్లిం సమాజ ప్రతినిధులు కోరిన అదనపు సౌకర్యాల ను పరిశీలించి, సాధ్యమైన మేరకు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంత రం కడ అతిథి గృహాన్ని పరిశీలించిన వికాస్ మర్మత్, ఉన్నతాధికారులు, ముఖ్య అతిథులు, ప్రతినిధులకు అనుకూలంగా మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. పెండింగ్ పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయడంతో పాటు పరిశుభ్రత, సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పోగూరుపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఏటిహెచ్ఏ గ్రూపునకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన ఆయన, పరిశ్రమ లకు అవసరమైన రహదారులు, మౌలిక వసతులను సకాలంలో కల్పించాలని సూచించారు. పారిశ్రామిక అభివృద్ధితో పెట్టుబడులు, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. పర్యటనలో సంబంధితశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేతాజీ త్యాగాలు యువతకు స్ఫూర్తిదాయకం
## డాక్టర్ బి.సి.నాగరాజ్



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు18:**
కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశసేవను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.సి. నాగరాజ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరంలో నేతాజీ పోషించిన పాత్ర, ఆయన ధైర్యసాహసాలు, త్యాగాలు చిరస్మరణీయమన్నారు. 'జైహింద్' నినాదంతో దేశభక్తిని రగిలించిన నేతాజీ, ఆజాద్ హింద్ ఫౌజ్‌కు నాయకత్వం వహించి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించారని తెలిపారు. నేతాజీ నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, దేశభక్తి, త్యాగనిరతి నేటి యువతకు ఆదర్శమన్నారు. ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని దేశ సమగ్ర అభివృద్ధి, ఐక్యత, సేవాభావం కోసం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.భాస్కరన్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు18:**



కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో ఐటీడీపీ కీలక పాత్ర పోషించాలని కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.ఎస్. మునిరత్నం పిలుపునిచ్చారు. శాంతిపురంలో కుప్పం నియోజకవర్గ ఐటీడీపీ నాయకులతో నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్య తనిస్తోందన్నారు. కుప్పంలో రహదారులు, సాగునీరు, విద్య, వైద్యం, పరిశ్రమలు, ఉపాధి తదితర రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లా లని సూచించారు. పార్టీ, ప్రభుత్వం కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి శ్రీకాంత్, మండల అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, ఐటీడీపీ నాయకులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో
# సారె సమర్పించిన బొజ్జల రిషిత రెడ్డి



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు18:**
రేణిగుంట పట్టణంలోని శ్రీ గంగమ్మ తల్లి జాతర మహోత్సవం కన్నులపండువగా సాగింది.ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి మంగళవారం అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న బొజ్జల రిషిత రెడ్డికి ఆలయ కమిటీ చైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి,టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, స్థానిక నాయకులు మరియు కమిటీ సభ్యులు బ్యాండ్ మేళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించారు.ఆలయ అర్చకులు ఆమెకు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలను బహూకరించారు.ఈ వేడుకల్లో కూటమి కుటుంబ సభ్యులు మరియు భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

# చెకుముకి సైన్స్ సంబరాలకు సిద్ధం కావాలి
### పోస్టర్ విడుదల చేసిన జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు18:**
జాతీయ స్థాయిలో ఉత్తమ సైన్స్ సంస్థగా అవార్డు పొందిన జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న 37వ చెకుముకి సైన్స్ సంబరాల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జన విజ్ఞాన వేదిక మండల కార్యదర్శి కుప్పుస్వామి పిలుపునిచ్చారు. రేణిగుంట బాలికల పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు కలిసి విడుద ల చేశారు. ఈ సందర్భంగా కుప్పుస్వామి మాట్లాడుతూ.. ఆగస్టు 27న పాఠశాల స్థాయిలో 8,9,10వ తరగతి విద్యార్థుల కు చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థుల బృందాలకు సెప్టెంబర్ 11న మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. మండల స్థాయిలో విజేతలకు సెప్టెంబర్ 27న జిల్లా స్థాయి పోటీలు, జిల్లా స్థాయిలో విజయం సాధించిన వారికి నవంబర్ 1,2,3 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్యామల,అధ్యాపకులు మోహన్, ఉపాధ్యాయులు ఉషశ్రీ,జయమ్మ, విజయలక్ష్మి, పద్మ, జన విజ్ఞాన వేదిక తిరుపతి ఉపాధ్యక్షుడు ఓ. వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ వైద్యుడిగా అవార్డు అందుకున్న డాక్టర్ జయగోపాల్‌కు ఘన సన్మానం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 18:**




శ్రీకాళహస్తి 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ జయగోపాల్ ఉత్తమ వైద్యుడిగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు గరిక పాటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ వైద్య రంగంలో డాక్టర్ జయగోపాల్ అందిస్తున్న సేవలు అభినందనీయమని, ఉత్తమ వైద్యుడిగా అవార్డు అందుకోవడం శ్రీకాళహస్తి ప్రాంతానికి గర్వకా రణమని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ మరిన్ని విజయాలు సాధిం చాలని ఆకాంక్షించారు. అవార్డు అందుకున్న డాక్టర్ జయగోపాల్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. కార్యక్రమంలో చక్రాల మహేష్, సంపత్ నాయుడు, గురుస్వామి, అబ్దుల్ హమీద్, పసల కమల, కేశవ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే చరిత్రహీనులే

-మొదటిపేజీ తరువాయి
ముఖ్యమంత్రిగా యాక్ట్ ఆఫ్ 5 కింద బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించానని, 2013 వరకు జరిగిన అన్ని స్థానిక ఎన్నికల్లో ఇదే కోటాను అమలు చేశామని తెలిపారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, దేవేందర్ గౌడ్ వంటి ఎందరో బీసీ నేతలు టీడీపీ ద్వారానే బలమైన నాయకులుగా ఎదిగారని ఉదహరించారు. ఇప్పుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అదే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళుతోందని చెప్పారు.

### గత ప్రభుత్వ ద్రోహాన్ని ఎండగట్టిన సీఎం

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేసిందని చంద్రబాబు తీవ్రంగా ఆరోపించారు. 2019లో జీవో 176 తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీంకోర్టులో సరిగ్గా వాదనలు వినిపించకుండా బీసీల హక్కులను కాలరాశారని విమర్శించారు. జీవోలు 559, 560 ద్వారా 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 24.15 శాతానికి తగ్గించి, తద్వారా సుమారు 16,800 బీసీ నాయకత్వ స్థానాలు కోల్పోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. “బీసీలకు ద్రోహం చేయటంలో వాళ్లు నెంబర్ వన్” అని ఘాటుగా వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం బీసీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని చంద్రబాబు ఆరోపించారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి వారిపై అక్రమ కేసులు బనాయించి వేధించారని గుర్తుచేశారు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టడం, తోట చంద్రయ్య గొంతు కోయడం, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య హత్యల వంటి దారుణాలను ప్రస్తావిస్తూ.. వారు సిద్ధాంతాల కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, కనీసం కుర్చీలు కూడా వేయకుండా అవమానించారని దుయ్యబట్టారు.



### బీసీల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళిక


తమ ప్రభుత్వం బీసీలకు కేవలం రిజర్వేషన్లు ఇవ్వడమే కాకుండా, వారి సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. “బీసీ అంటే వెనుకబడిన వారు కాదు, అవకాశం రాక వెనుకబడిన వారు” అని అభివర్ణించారు. రాష్ట్ర జనాభాలో 50.54 శాతంగా ఉన్న బీసీల విద్య, నైపుణ్యం, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని, వారి అద్భుతమైన నైపుణ్యాలకు టెక్నాలజీని జోడించి ప్రపంచానికి పరిచయం చేస్తామని హామీ ఇచ్చారు.

### ఎన్నికలు తక్షణావసరం

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికలు నిర్వహిస్తేనే 16వ ఆర్థిక సంఘం నుంచి గ్రామీణ ప్రాంతాలకు రూ.2300 కోట్లు, పట్టణ ప్రాంతాలకు రూ.1,562 కోట్ల గ్రాంట్లు వస్తాయని వివరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికి వైసీపీ సభ్యులు హాజరు కాకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ చారిత్రక నిర్ణయానికి సభ ఆమోదం తెలపాలని కోరుతూ, స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా కలిసికట్టుగా పనిచేసి, సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలని పిలుపునిచ్చారు.

# లోకల్ బాడీ ఎన్నికల ఫీవర్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో మరో రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలయ్యే అవకాశం ఉండటంతో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లపై కసరత్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలను ఏ విధానంలో నిర్వహించాలనే అంశం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈవీఎంల కంటే బ్యాలెట్ పేపర్ విధానానికే ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన ముందుకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.స్థానిక ఎన్నికలకు అవసరమైన స్థాయిలో ఈవీఎంలు అందుబాటులో లేకపోవడం బ్యాలెట్ వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. బ్యాలెట్ విధానంలో ఓటరు అభ్యర్థుల గుర్తులు, పేర్లను చూసి తనకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయాల్సి ఉంటుంది. అందువల్ల అభ్యర్థి వ్యక్తిగత పరిచయం, గ్రామంలో చేసిన పని, స్థానిక సమస్యలపై అవగాహన వంటి అంశాలకు ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ఓటింగ్ విధానం ఒక్కటే ఎన్నికల ఫలితాలను నిర్ణయించదు. ప్రజల అభిప్రాయం, అభ్యర్థుల బలం, పార్టీ సంస్థాగత సామర్థ్యం, స్థానిక సమస్యలు వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి, తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమికి మధ్య పోటీపై ఆసక్తి నెలకొంది. బ్యాలెట్ విధానం తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నట్లు రాజకీయ చర్చల్లో వినిపిస్తోంది. అయితే గ్రామస్థాయిలో ఓటర్లు తమ ప్రాంతానికి ఎవరు మెరుగైన సేవలు అందించగలరనే విషయాన్ని ప్రధానంగా పరిశీలించే అవకాశం ఉంది.కూటమి విషయానికి వస్తే సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టి పెడుతోందనే ప్రచారం



ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు కూడా స్థానిక రాజకీయాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య కూటమి సమన్వయం కూడా ఎన్నికల సమయంలో కీలకంగా మారవచ్చు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, సాగునీరు, విద్య, ఉపాధి వంటి స్థానిక అవసరాలపై ప్రజల దృష్టి ఉంటుంది. ప్రభుత్వం చేపట్టిన పనులు తమ ప్రాంతానికి ఎంతవరకు ఉపయోగపడ్డాయో ఓటర్లు అంచనా వేసే అవకాశం ఉంది. అదే సమయంలో స్థానిక అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల బ్యాలెట్ విధానం అమలైతే ఒక పార్టీకి స్వయంచాలకంగా ప్రయోజనం కలుగుతుందని చెప్పడం కష్టం. ఎన్నికల ఫలితాలను నిర్ణయించేది చివరకు ప్రజల తీర్పే. గ్రామస్థాయిలో తమకు దగ్గరగా ఉన్న సమస్యలను ఎవరు పరిష్కరిస్తారనే అంశమే ఓటర్ల నిర్ణయంపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో రాబోయే స్థానిక ఎన్నికలలో ఏ పార్టీ గెలుస్తుంది అన్న విషయం పై సర్వత్ర ఉత్కంఠత నెలకొంది..

# చంద్రుడిపై శాశ్వత అడుగులు

**విజయవాడ :** చంద్రుడిపై మనిషి ఎక్కువకాలం నివసించగలడా? అక్కడే ఉండి పరిశోధనలు చేయడం, అవసరమైన వనరులను వినియోగించుకోవడం సాధ్యమేనా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతుకుతూ అమెరికా అంతరిక్ష సంస్థ కీలక ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో దశలవారీగా ఏర్పాటు చేసి, భవిష్యత్‌లో అక్కడ దీర్ఘకాలిక మానవ ఉనికికి పునాది వేయాలని నాసా లక్ష్యంగా పెట్టుకుంది. నాసా ప్రస్తుత ప్రణాళిక ప్రకారం 2029–32 మధ్య ప్రారంభ నివాస సదుపాయాలను ఏర్పాటు చేసి, 2032 తర్వాత చంద్రుడిపై నిరంతర మానవ కార్యకలాపాలను విస్తరించనుంది చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయడం అంత సులభమైన విషయం కాదు. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, రేడియేషన్, చంద్ర రాత్రుల్లో విద్యుత్ కొరత, భూమి నుంచి దూరం వంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే రోవర్లు, ల్యాండర్లు, డ్రోన్లు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, నివాస మాడ్యూళ్లను దశలవారీగా చంద్రుడిపైకి పంపి వాటి పనితీరును పరీక్షించాలని నాసా భావిస్తోంది.మూన్ బేస్‌కు చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని ఎంచుకోవడానికి ప్రధాన కారణం అక్కడి ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు. శాశ్వతంగా నీడలో ఉండే కొన్ని ప్రాంతాల్లో నీటి మంచు ఉండే అవకాశం ఉంది. నీటిని భవిష్యత్‌లో తాగునీరు, ఆక్సిజన్, హైడ్రోజన్ వంటి వనరుల కోసం ఉపయోగించగలిగితే చంద్రుడిపై దీర్ఘకాలిక మానవ నివాసానికి అది కీలకంగా మారుతుంది.ఇక్కడే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పరిశోధనలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.



చంద్రయాన్–2లోని పరికరం చంద్రుడి ధ్రువ ప్రాంతాలను రాడార్ ద్వారా అధ్యయనం చేసింది. 2026లో ఇస్రో వెల్లడించిన తాజా పరిశోధన ప్రకారం.. చంద్రుడి దక్షిణ ధ్రువంలోని కొన్ని శాశ్వత నీడ ప్రాంతాల్లోని నాలుగు క్రేటర్ల అడుగుభాగాల్లో ఉపరితలానికి దిగువన నీటి మంచు ఉండే అవకాశాన్ని రాడార్ పరిశీలనలు సూచించాయి. చంద్రయాన్–2 డేటా ఆధారంగా ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రుడి ధ్రువ ప్రాంతాల్లో నీటి మంచు, ఉపరితల స్వభావం, ఇతర భౌతిక లక్షణాలకు సంబంధించిన కీలక డేటాను రూపొందించారు. భవిష్యత్ చంద్ర మిషన్ల ల్యాండింగ్ ప్రాంతాల ఎంపికకు ఈ సమాచారం ఉపయోగపడే అవకాశం ఉంది.నాసా ప్రణాళిక ప్రకారం తొలి దశలో రోవర్లు, ల్యాండర్లు, ఇతర రోబోటిక్ వ్యవస్థలు చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని పరిశీలిస్తాయి. అనంతరం 2029 నుంచి సెమీ–పర్మినెంట్ మౌలిక సదుపాయాలు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, నివాస సదుపాయాల ఏర్పాటు ప్రారంభమవుతుంది. ఈ దశలో భారీ మొత్తంలో కార్గోను చంద్రుడిపైకి పంపేందుకు అనేక ల్యాండర్ మిషన్లను ఉపయోగించనున్నారు2032 తర్వాతి దశలో మాత్రం లక్ష్యం మరింత పెద్దది. వ్యోమగాములు చంద్రుడిపై ఎక్కువకాలం నివసించి పనిచేసేలా సెమీ–పర్మినెంట్ హ్యాబిటేషన్ మాడ్యూళ్లు, దీర్ఘకాలిక విద్యుత్ వ్యవస్థలు, ప్రెషరైజ్డ్ రోవర్లు, నిరంతర సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నాసా భావిస్తోంది. ఈ మూన్ బేస్ భవిష్యత్‌లో అంగారకుడి వంటి సుదూర గ్రహాల మిషన్లకు శిక్షణ, పరిశోధన, సాంకేతిక పరీక్షల కేంద్రంగా ఉపయోగపడే అవకాశం ఉంది.అయితే ఒక ముఖ్యమైన విషయాన్ని గమనించాలి. ప్రస్తుతం నాసా అధికారిక ప్రణాళికలో 2027లో ఆర్టెమిస్–3 ద్వారా నేరుగా చంద్రుడిపై మానవులు దిగడం కాకుండా, ఆ మిషన్‌ను భూమి కక్ష్యలో కీలక వ్యవస్థల పరీక్షలకు ఉపయోగించనున్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికి తొలి ప్రణాళికాబద్ధమైన మానవ ల్యాండింగ్ ఆర్టెమిస్–4తో 2028లో జరగనుంది.చంద్రుడిపై మానవాళి దీర్ఘకాలిక ఉనికికి అడుగులు పడుతున్న వేళ.. ఇస్రో అందిస్తున్న చంద్ర ధ్రువ ప్రాంత డేటా, నీటి మంచిపై పరిశోధనలు, భవిష్యత్ చంద్ర మిషన్లకు భారత్ కీలక భాగస్వామిగా నిలిచే అవకాశాన్ని పెంచుతున్నాయి. చంద్రుడిపై మొదలయ్యే ఈ కొత్త అధ్యాయం.. చివరికి అంగారకుడిపై మనిషి అడుగుపెట్టే ప్రయాణానికి మరో పెద్ద మెట్టుగా మారనుంది.

## అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి
స్పష్టం చేశారు. మేయర్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, పాత విధానంలో ఒక్క డిప్యూటీ మేయర్ పదవికే పరిమితం కావాలని నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదని, ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లే కొనసాగుతాయని స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు కేబినెట్‌కు వివరించారు. ప్రస్తుతం ఉన్న 13 జెడ్పీలను జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. మొత్తం 57 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**జాబ్ క్యాలెండర్‌పై కీలక నిర్ణయం:**
ఉద్యోగాల కల్పన, పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలపై నిర్ణయాలు తీసుకున్నారు. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌పై కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ విద్యార్థులకు ××–జీజుజు, చీజుజు కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లు, ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ బిల్లుపై చర్చించింది. మద్యం బ్రాండ్లకు పిచ్చిపిచ్చి పేర్లు పెట్టొద్దు: మంత్రివర్గ అజెండా అంశాలపై చర్చ పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ పరిణామాలపై మంత్రులు, అధికారులతో చర్చించారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వస్తున్న నెగిటివ్ కామెంట్లపై ధీటుగా స్పందించాలని సూచించారు. మద్యం బ్రాండ్లకు పిచ్చిపిచ్చి పేర్లు పెట్టకుండా కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా కంటైనర్లలో ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయి

-మొదటిపేజీ తరువాయి
నితిన్ నబిన్ విమర్శించారు. “పార్లమెంటులో ప్రతిపక్షాల తీరు, స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నాయకుల ప్రవర్తనను యావత్ దేశం గమనించింది. బీజేపీ కార్యకర్తలు ఎల్లప్పుడూ క్రమశిక్షణతో ఉంటారు, అయితే ప్రధానమంత్రి పట్ల ఉపయోగించిన పరుష పదజాలాన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదు” అని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ‘పార్ట్–టైమ్ రాజకీయ నాయకుడు’ అని ఎద్దేవా చేస్తూ, ఆయన కేవలం ప్రజల దృష్టిని మళ్లించే అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ‘వికసిత భారత్’ ఆవిష్కారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని, దేశవ్యాప్తంగా రూ. 8 లక్షల కోట్లకు పైగా విలువైన మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నేటి యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, స్టార్టప్‌ల ద్వారా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిందని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర పార్టీ ఇన్చార్జిలు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

## స్పష్టమైన విజన్, పారదర్శక పాలనే విజయానికి మూలం

-మొదటిపేజీ తరువాయి
చంద్రబాబు విజన్, పారదర్శక పాలన, వ్యాపార నిర్వహణలో వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి” అని వివరించారు. రాష్ట్రం వేగంగా పారిశ్రామిక శక్తిగా ఎదుగుతుండటం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సానుకూల వాతావరణంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫలితాలను అందిస్తుండటంతో, ఇప్పుడు ప్రపంచం చూపు ఏపీ వైపు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

## మాజీ మంత్రి కుమారుడికి పెళ్లి ఇష్టం లేదా.. సోషల్ మీడియాలో వైరల్!

**విజయవాడ :** వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబంపై సొంత కోడలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కుటుంబ వ్యవహారం కాస్త రచ్చకు దారితీసింది. ఆ కుటుంబ సభ్యులు 11 మందిపై పోలీసులు కేసు నమోదు కూడా చేశారు. ఒకవైపు ఈ కేసు విచారణ కొనసాగుతుండగా.. ఆ కుటుంబానికి చెందిన వ్యక్తిగత వ్యవహారం సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. ఆ కుటుంబ సభ్యుల మధ్య జరిగిన సంభాషణకు సంబంధించి వీడియో వైరల్ అవుతోంది. మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడికి ఇష్టం లేని పెళ్లి చేశారని వెలుగు చూస్తోంది ఆ వీడియోలో. ఏకంగా జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తనకు ఈ పెళ్లి ఇష్టం లేదన్నట్టు చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. అనవసరంగా తనను ఒత్తిడి చేసి పెళ్లి చేయించారని ఆయన మాట్లాడుతున్న అంశాలకు సంబంధించి వీడియో వైరల్ అవుతోంది.మొన్న మధ్యన మాజీమంత్రి జోగి రమేష్ కుటుంబం పై ఆయన కోడలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తన అత్తవారు ఇంట తనకు మానసికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. తీవ్రంగా హింసిస్తున్నారని.. గృహ హింసకు పాల్పడ్డారని.. ఒకటి రెండుసార్లు హత్య ప్రయత్నం చేశారని ఆమె ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే జోగి రమేష్ మాజీ మంత్రి కావడం.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కావడం తీవ్ర చర్చకు దారితీసింది. పైగా ఆమె తెలంగాణకు చెందిన యువతి కావడంతో తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది ఈ ఘటన. అయితే దీనిని రాజకీయ కుట్రగా అభివర్ణించారు జోగి రమేష్ కుటుంబ సభ్యులు. కానీ గత కొంతకాలంగా జరుగుతున్న వ్యవహారాలతోనే బాధితురాలు బయటకు వచ్చినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. కేవలం జోగి రమేష్ కుటుంబ సభ్యులు మాత్రమే కాదు సమీప బంధువులు 11 మంది తనపై వేధింపులకు గురి చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.అయితే తాజాగా ఈ ఘటనకు సంబంధించి నిందితుల్లో ఒకడైన జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని.. కుటుంబ సభ్యుల బలవంతంగా ఈ పెళ్లికి ఒప్పించారని చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదైన తర్వాత జోగి రమేష్ కోడలి కుటుంబ సభ్యులకు జరిగిన చర్చలు బయటకు వచ్చాయి. అసలు తనకు ఈ వివాహం ఇష్టం లేదని.. అర్ధరాత్రి దాటిన తర్వాత వేకువ జాము వరకు తనకు వైట్ వాష్ చేశారని.. బలవంతంగా ఒప్పించారంటూ జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తండ్రి పై తిరగబడుతున్న వీడియోలకు సంబంధించిన దృశ్యాలు ఇప్పుడు బయటకు వచ్చాయి.. అయితే ఆ కుటుంబంలో అంతర్గతంగా జరిగిన చర్చలు బయటకు రావడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. అయితే సొంత కుటుంబ సభ్యులే ఈ వీడియో లిఫ్ట్ చేశారని అర్థం అవుతోంది. కాగా ఈ సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

## ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎర్రకోట రాజీవ్ రెడ్డి

**నందవరం:** మండలం, గురజాల గ్రామం నమస్తే ఎమ్మిగనూరు ? ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా నందవరం మండలం గురజాల గ్రామంలో 11వ రోజు కార్యక్రమానికి ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎర్రకోట రాజీవ్ రెడ్డి శ్రీకారం చుట్టారు. గ్రామానికి చేరుకున్న రాజీవ్ రెడ్డి గ్రామ నాయకులు నరసింహారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వీరస్వామి, కురువ నరసింహులు, జాను తదితరుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించి, పూలమాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,గ్రామ ప్రజలు, రైతులు, నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన ‘సూపర్ సిక్స్’ హామీలు అమలయ్యాయా? ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని రాజీవ్ రెడ్డి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బీసీ సోదరులు తమ సమస్యలను రాజీవ్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# వసతి గృహ విద్యార్థిని గర్భం..

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : పిడిఎస్యు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 18:**
శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని గర్భవతి కావడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని పిడిఎస్యు నాయకులు పేర్కొన్నారు. ఈ ఘటనపై బాధ్యులైన వార్డెన్, వాచ్‌మెన్, ఏఎన్ఎంలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.శ్రీకాళహస్తి పిడిఎస్యు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పిడిఎస్యు తిరుపతి జిల్లా అధ్యక్షులు ఎస్. జాకీర్, జిల్లా కార్యదర్శి హెచ్. లోకేష్ మాట్లాడుతూ తమ పిల్లల భద్రత, భవిష్యత్తుపై నమ్మకంతో తల్లిదండ్రులు వారిని ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పిస్తున్నారని తెలిపారు. అయితే విద్యార్థుల భద్రత, పర్యవేక్షణ విషయంలో వసతి గృహ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. ఇంటర్మీడియట్ చదివే వయసులో ఉన్న విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఘటన పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్యు నాయకులు డిమాండ్ చేశారు. వసతి గృహంలోని వార్డెన్, వాచ్‌మెన్, ఏఎన్ఎమ్‌లను తక్షణమే సస్పెండ్ చేయాలని, విద్యార్థిని గర్భానికి బాధ్యుడైన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. అలాగే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వసతి గృహాల నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో పిడిఎస్యు డివిజన్ నాయకుడు ముజీబ్, ఐఎఫ్‌టీయు నాయకుడు మూర్తి పాల్గొన్నారు.

## క్రీడలతో విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన భవిష్యత్తు బాలగురవం బాబు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు18:**
శ్రీకాళహస్తి డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా విభాగ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర క్రీడా విభాగం అధ్యక్షులు జీవీవీఎస్ కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ విద్యార్థులను క్రీడల పట్ల చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల అభివృద్ధితో దేశం మరింత ముందడుగు వేయడంతో పాటు, భావిభారత పౌరులు ఆరోగ్యంగా, దృఢంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.రాష్ట్ర క్రీడా విభాగం అధ్యక్షులు జీవీవీఎస్ కమలాకర్ మాట్లాడుతూ దేశంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వాలు తగిన స్థాయిలో చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. క్రీడా రంగంలోకూడా వెనుకబాటుతనం కొనసాగుతోందని అన్నారు. క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ పార్టీ దృష్టికి తీసుకువస్తే, వారికి న్యాయం జరిగే వరకు పార్టీ తరఫున పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిరణ్, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, దేవదానం, మణి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనుగౌడ్, జిల్లా కార్యదర్శులు ఇళయరాజా, గోపి, మాణిక్యం, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు హరికృష్ణ, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ అధ్యక్షులు రత్నం, మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఫయాజ్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, మండల అధ్యక్షులు తిరుమలై, షణ్ముగం, రఘునాథం, భాస్కర్, సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షులు సునీల్‌రెడ్డి, చందు, నాగరాజు, అరుణ్, చరణ్, జోసెఫ్, సారధి, ఆరుల్, ఆల్విన్, ధనశేఖర్, అంబేద్కర్ తదితర జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## పెయింటింగ్ పోటీలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 18:**
శ్రీకాళహస్తి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని తిరుపతిలోని రీజినల్ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పెయింటింగ్ పోటీల్లో శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.ఈ పోటీల్లో మూడో తరగతి విద్యార్థిని ఎన్. ప్రజ్ఞశ్రీ ప్రత్యేక బహుమతి, నాలుగో తరగతి విద్యార్థి ఎన్. ధ్రువ చాణక్య ద్వితీయ బహుమతి సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. విద్యార్థుల విజయానికి నిరంతరం ప్రోత్సాహం అందించిన వారి తల్లి స్వాతిని పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎ.రూపాదేవి మాట్లాడుతూ.. విద్యార్థుల సృజనాత్మకతే వారి విజయానికి పునాది అని అన్నారు. సాధించిన విజయం మరిన్ని విజయాలకు మార్గం చూపుతుందని పేర్కొన్నారు. రంగుల ప్రపంచంలో విద్యార్థులు తమ ప్రతిభను చాటడం అభినందనీయమన్నారు. ఏజీఎం సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మక ప్రతిభను అభినందించారు. ఇలాంటి పోటీల్లో విద్యార్థులు మరింత ఉత్సాహంగా పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ బాలాజీ, జోనల్ కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, లావణ్య, డీన్ త్రివేణి, ఇన్‌చార్జ్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి సర్వీసు నిబంధనలే మేలు



రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు, బోధన తీరు, మౌలిక వసతులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టనున్నది. విద్యాశాఖ ఏర్పాటు చేసిన అకడమిక్ ప్యానెల్ బృందాలు తరగతి గదుల్లో బోధన విధానం, పాఠ్య ప్రణాళిక, సిలబస్ పూర్తయిన తీరు, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు వంటి అంశాలను పరిశీలిస్తారు. విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం సామర్థ్యాలను కూడా అంచనా వేయనున్నారు. ఉపాధ్యాయులకు అవసరమైన విద్యాపరమైన సహకారం అందించడం, పాఠశాలల్లోని గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజనం నాణ్యత, విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు తదితర అంశాలపైనా బృందాలు దృష్టి సారించనున్నాయి. సర్కార్ బడుల్లో చదువు, బోధన, వసతుల అసలు పరిస్థితిని పర్యవేక్షించే పాఠశాల తనిఖీలు చాలా కాలంగా పడకేశాయి. ప్రధానంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్ న్యాయవివాదాల నేపథ్యంలో ఎంఈవో, డిప్యూటీ ఈవో, డీఈవో ఖాళీల భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. విద్యాశాఖలో పనిచేస్తున్న డీఈవోలంతా ఇన్‌చార్జులే! వీరికి తరగతిలో ప్రత్యక్ష అనుభవం లేదు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎంఈవో ఇన్‌చార్జులుగా అదనపు బాధ్యతలు నిర్వహించడంతో కీలకమైన తరగతి బోధన పరిశీలన నామమాత్రమైంది. అంతేకాదు, విద్యావ్యవస్థలో బోధన కంటే బోధనేతర బాధ్యతలు ఎక్కువయ్యాయి. ఎంఈవోలపై ఒత్తిడి పెరిగింది. పర్యవేక్షణ గాడి తప్పింది. కొత్త నియామకాలు చేపట్టకుండా, పాఠాలు చెప్పే రెగ్యులర్ ఉపాధ్యాయులకే అదనపు బాధ్యతలు కట్టబెట్టడం వలన ప్రయోజనం ఉండదు. ఈ నేపథ్యంలో మండలానికి ఇద్దరు ఎంఈవోలను నియమించాలనే ప్రతిపాదన చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రానికి కొత్తగా 33 జిల్లాలతో కూడిన రాష్ట్రపతి ఉత్తర్వులు 2018లో అమల్లోకి వచ్చాయి. ఈ ఉత్తర్వుల్లోని పేరా 3(3)లో పంచాయతీరాజ్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల ఏకీకృతం గురించిన సవరణపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఈ నేపథ్యంలో 2021లో పంచాయతీరాజ్ శాఖలోని వివిధ పోస్టులను లోకల్ క్యాడర్లుగా వర్గీకరిస్తూ అదే ఏడాది 204 జీవోను ఇచ్చారు. విద్యాశాఖలోని పోస్టులను జీవో 158 ద్వారా, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను జీవో 245 ద్వారా, మండల, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులను జీవోలు 256, 257 ద్వారా లోకల్ క్యాడర్లుగా వర్గీకరించారు. ఫలితంగా సుప్రీంకోర్టు/హైకోర్టు వివిధ సందర్భాల్లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం వేర్వేరు లోకల్ క్యాడర్లుగా ప్రభుత్వ పాఠశాల, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులుగా వర్గీకరించినట్లు అయింది. అవసరమైతే న్యాయ సలహాలను కూడా స్వీకరించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టికల్ 309 ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి రెండు క్యాడర్లను ఏకీకృతం చేస్తూ సర్వీస్ రూల్స్ రూపొందించే అధికారం ఉన్నది. దీనివలన దశాబ్దాల తరబడి ఉపాధ్యాయుల పర్యవేక్షణ పోస్టుల భర్తీకి ఉన్న అడ్డంకి తొలగిపోతుంది. రాష్ట్రవ్యాప్తంగా 66 పోస్టులకుగాను 64 డిప్యూటీ విద్యాధికారి పోస్టులు, 33 జిల్లాలకుగాను 26 డీఈవో పోస్టులు ఖాళీలు ఉండడంతో విద్యాపాలన కుంటుపడింది. పర్యవేక్షణ పడకేసింది. ఎడ్యుకేషన్ కోడ్ ప్రకారం జరుగాల్సిన విద్యాపాలన అటకెక్కింది. ఫలితంగా ఉపాధ్యాయుల పనితీరు, బోధన, హాజరు, మధ్యాహ్న భోజనం, యూనిఫారాల వంటి అంశాలను పర్యవేక్షించే అవకాశం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో 630 మండలాలు ఉండగా...363 మండలాలకు మాత్రమే ఎంఈవో పోస్టులు మంజూరయ్యాయి. గత ప్రభుత్వం మరో 125 పోస్టులు మంజూరు చేసింది. ఇంకా 142 కొత్త మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు కాలేదు. ఇద్దరు ఎంఈవోల వ్యవస్థను అమల్లోకి తేవాలంటే ఆ 142తోపాటు కొత్తగా 630 ఎంఈవో పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయాలి. 'రెండో ఎంఈవో వస్తే ఆ వ్యవస్థను తొలగించే అవకాశం ఉంటుంది. దానివల్ల 1,800 మంది ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలలపై దృష్టి పెట్టవచ్చు. ప్రస్తుతం ఎంఈవోలు అటు పరిపాలనాపరమైన, ఇటు విద్యాపరమైన బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తున్నది. రెండో ఎంఈవో వస్తే వేర్వేరు బాధ్యతలు అప్పగించవచ్చు. ఫలితంగా పాఠశాలలపై పర్యవేక్షణ పెరుగుతుంది'. రాష్ట్ర విద్యామంత్రిగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యాశాఖలో పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయడానికి, ఉమ్మడి సర్వీసు నిబంధనలను అమలు చేయడానికి చొరవ చూపి విధానపరమైన నిర్ణయాలు తీసుకుని అమలు చేయాలని ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు.

# సింహాసనం వణకలేదు, స్పందించింది!




సమాజ విశ్లేషకులు డానీ రాసిన 'సింహాసనం వణికింది' వ్యాసం (31.07.2026) నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై జరిగిన 'కాక్రోచ్' విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా రాసినట్టుగా కనపడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని పూర్తిగా టార్గెట్ చేసింది. వ్యాసకర్త ఎక్కడా విద్యార్థుల ఆందోళనకు దారితీసిన పరిస్థితులపై కానీ, విద్యార్థుల డిమాండ్లను విశదీకరించటంపై కానీ, నీట్ లీక్ సూచనలపై కానీ దృష్టి పెట్టలేదు. మోదీని ప్రపంచ నియంతగా చూపించి హిట్లర్ పక్కన చేర్చే ప్రయత్నానికే అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

జంతర్ మంతర్ ఉద్యమం మొదటి కోరిక కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. ప్రధానమంత్రి విద్యార్థుల కోరిక తీర్చారు. కానీ డానీ మాత్రం, 'ఇంతకాలం ఒక నారటివ్‌ను మన చేత నమ్మించారు: భారత ప్రధాని సర్వశక్తిమంతులు, సర్వజ్ఞులు. వారు అనుకున్నదే జరుగుతుంది. ఎంతటివారైనా వారి పాదాక్రాంతం కావాల్సిందే. వారు హిమాలయాలంత ఎత్తులో ఉంటే, దేశంలోని ప్రధాన ప్రతిపక్ష నాయకుడు తూర్పు కనుమల్లోని చిన్న గుట్ట మాత్రమే,' అని వ్యాసకర్త తన ఊహాజనిత కథనం రాశారు. తాను హిమాలయాలంత ఎత్తు అన్న భావన ప్రధానికీ లేదు. తాను తూర్పు కనుమల్లోని చిన్న గుట్ట అన్న అభిప్రాయం ప్రతిపక్ష నాయకునికీ లేదు, ఆ పార్టీ శ్రేణులకూ లేదు. దేశ ప్రజలకూ లేదు. ఈ రెండు అభిప్రాయాలూ వ్యాసకర్త సొంత అభిప్రాయాలు మాత్రమే. ఆయన దృష్టిలో వారిరువురికీ ఇచ్చిన స్థానం అది. దానిని పాఠకులపై రుద్దే ప్రయత్నం చేశారు. 'షాహీన్ బాగ్, మూడు వ్యవసాయ చట్టాల వ్యతిరేక రైతు ఉద్యమం, మహిళా రెజ్లర్ల ఆందోళనలు వంటి సంఘటనలను సామాజిక వర్గాల ఉద్యమంగా ముద్ర వేసి సమాజం నుంచి వేరు చేశారు,' అంటూ అవి సాధించని విజయాన్ని జంతర్ మంతర్ సాధించిట్లు సూత్రీకరించారు వ్యాసకర్త. అవును, ఆ గత ఉద్యమాల పరిధి, విస్తృతి చిన్నది కాబట్టే అవి దేశవ్యాప్తం కాలేకపోయాయి. వాటి పట్ల కూడా కేంద్రం నియంత పోకడ ఎక్కడా చూపించలేదు. పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది. కాబట్టే అవి కొంతకాలం రగిలి శాంతించాయి. ఆ ఉద్యమాలు వేరు. జంతర్ మంతర్ ఆందోళన వేరు. మొదటివి కాస్తో కూస్తో అనుభవం, పెద్దరికం, నిర్దిష్టమైన నిర్మాణంతో ఉద్యమించాయి. జంతర్‌మంతర్‌లో 'బొద్దింకలు' మాత్రమే ఆందోళనలు చేశాయి. నాయకత్వం వహించాయి. ఇవి లేవనెత్తిన అంశం దేశవ్యాప్తమైన యువతకు సంబంధించిన సమస్య. కింది కులాల వారికంటే, అసంఖ్యాక మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాల సమస్య. కాబట్టే ఎలాంటి నిర్మాణం, నాయకత్వం, నిధుల సమీకరణ వంటి ముఖ్యమైన అంశాలు లేకున్నా, సోషల్ మీడియా పిలుపుతోనే బలమైన గొంతుకలను సమీకరించాయి, బలంగా వినిపించాయి. మరో కీలకమైన అంశం ఏమిటంటే, ఏ దేశంలోనైనా యువత ఆందోళనలు చాలా వాడిగా వేడిగా ఉంటాయి. వాటి పట్ల ప్రభుత్వాలు చాలా అప్రమత్తంగా ఉంటాయి. కట్టుదాటితే శాంతి భద్రతలు, దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. ఈ ప్రజాస్వామిక స్పృహ కేంద్రానికి బలంగా ఉంది. ఈ ఆందోళనలో కూడా ఎన్నో అపశ్రుతులు దొర్లాయి. మోదీ వ్యతిరేక శక్తులు ఇందులో పనిచేశాయి. రక్షణ బలగాలపై దాడులు జరిగాయి. ప్రధానిని, ఆయన తల్లిని అమానవీయకరమైన వ్యాఖ్యలు చేసి దూషించారు. అవి అవసరం లేదు. ఐనా ఎందుకు చేశారు? బహుశా ఉద్యమాన్ని రక్తపు మడుగుల దిశగా నడిపించాలని అదృశ్య శక్తులు తలపోసి ఉండవచ్చు. ఈ అంశాన్ని పసిగట్టే ప్రధాని 'మన పిల్లలు' అన్న భావనతో సమస్య పరిష్కారం కోసం ముందడుగు వేశారు. ధర్మేంద్ర ప్రధాన్ ఎంత బలమైన నాయకుడు ఐనా, తాను నమ్మిన నేత ఐనా, ఆయన నేతృత్వంలో బీజేపీ గెలుపు గుర్రం అధిరోహించినా, అప్పటికే నీట్‌పై కొన్ని సానుకూల నిర్ణయాలు తీసుకున్నా కూడా, విద్యార్థుల మొదటి డిమాండ్‌ను నెరవేర్చి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించారు ప్రధానమంత్రి. మిగిలిన రెండు డిమాండ్‌లను అంగీకరించారు. ఇది ప్రజాస్వామ్య పాలకుడికి ఉండాల్సిన మొదటి లక్షణం. నియంతలకు ఇలాంటి ఇజం ఉండదు. 'ఈ ఉద్యమం మరో ముఖ్యమైన విషయాన్ని కూడా నిరూపించింది. నాయకుడు అన్నీ తాను కాకూడదు. ప్రజలను ఉద్యమించేలా చేయాలి. ఇది సీట్ల కోసం, పదవుల కోసం, కూటముల కోసం పరస్పరం తగవులాడుకుంటూ రోజు రోజుకూ బలహీనపడుతున్న విపక్షాలకు ఒక గుణపాఠం. ప్రజలను వీధుల్లోకి తీసుకురండి. ప్రజలకు నాయకత్వం అప్పజెప్పండి' అంటూ విపక్షాలను కూడా నెమలి ఈకల విమర్శతో నిమిరారు వ్యాసకర్త. లేకపోతే తన లోగుట్టు పూర్తిగా బయటపడుతుందని, 'సమాజ విశ్లేషకులు' అన్న పదానికి మరక పడుతోందని జాగ్రత్తపడ్డారు, భయపడ్డారు. వెరసి, ఈ వ్యాసకర్త బొద్దింకల మాటున 'పెద్ద బొద్దింక'గా గుర్తింపు పొందేందుకు తెగ తాపత్రయపడ్డారు. ప్రధానమంత్రిని ఎంత బలంగా బోనులో నిలబెడితే, తనకు అంతే గుర్తింపువస్తుందని చాలా ఆశపడ్డారు.

## సవాళ్లకు సన్నద్ధం చేసే విద్యావిధానం కావాలి

నీట్ పరీక్షా పత్రం పదే పదే లీక్ కావడంతో మొదలైన నిరసన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అసంతృప్తికి వేదికగా మారి దేశవ్యాప్తంగా యువత విద్యావిధానంలో వైఫల్యాలపై ఉద్యమించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పట్టుపట్టిన యువత చివరకు విజయం సాధించింది. మంత్రి రాజీనామాకు ప్రాధాన్యత ఇచ్చారు. కానీ ఆయన స్థానంలో విద్యాశాఖను ఎవరికి అప్పగించారనే అంశాన్ని పట్టించుకోలేదు. మంత్రుల రాజీనామాలు యూపీఏలో ఉంటాయి, కానీ ఎన్డీయేలో కాదు అంటూ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించిన తర్వాత ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో యువత డిమాండ్‌కు ప్రధాని మోదీ తలొగ్గారు. ప్రధాన్ స్థానంలో నియమించిన కొత్త విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని చూస్తే యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తీసుకున్న నిర్ణయంలా కనిపించడం లేదు. జోషి చదివింది సాధారణ బీఏనే. ప్రపంచానికి ఏఐ సవాల్ విసురుతున్న కాలంలో యువతను దీనికి అనుగుణంగా తీర్చిదిద్దడానికి విద్యావంతుడైన విద్యాశాఖ మంత్రి అవసరం ఎంతో ఉన్నది. కృత్రిమ మేధ ప్రపంచాన్ని వణికిస్తున్నది. ప్రపంచాన్ని శాసిస్తున్న ఐటీ కంపెనీలు కూడా ఏఐ ప్రభావం ఎంతవరకు ఉంటుందో చెప్పలేక పోతున్నారు. ఎలాన్ మస్క్ లాంటి వారు ఏఐ ఒక్క ఐటీ ఉద్యోగాలనే కాదు, డాక్టర్లు, లాయర్ల వృత్తులను కూడా మింగేస్తుందని జోస్యం చెప్తున్నారు. భారతీయ యువతకు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయంటే అది ఐటీ రంగంతోనే. ఏఐ ఐటీ రంగాన్ని మింగేస్తే మొదట బలయ్యేది భారతీయ యువతనే. ఈ నేపథ్యంలో ఏఐ విసురుతున్న సవాళ్లకు యువతను సన్నద్ధం చేసే విద్యావిధానం ఉండాలి. మన దేశ యువతకు భవిష్యత్తులో ఏఐ, సెమీ కండక్టర్లు, డాటా సైన్స్, రోబోటిక్స్, పరిశోధన వంటి రంగాల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి . ఇవన్నీ విద్యావిధానంతో ముడిపడి ఉన్నాయి. మన యువతను 2030–40లో లభించే ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామా? ఆ మేరకు మన విద్యావ్యవస్థలో సంస్కరణలు చేపడుతున్నామా? లేదా? అనేది మన దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143